కథ



# బువ్వ గిన్నె

మొగిలి దేవప్రసాద్

నడినెత్తిన మండే సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. అయినా తమ బంధం ఆత్మ బంధమైన సూర్యుణ్ని చూచి యానాదులు ఆనందిస్తున్న సమయం. జనమంతా గుమికూడారక్కడ.

ఎప్పుడూ గోచిగుడ్డలతో, సగం గుడ్డపేలికలు చుట్టుకున్న శరీరాలు, ఇప్పుడు నిండుగా, రంగురంగు గుడ్డలు తొడుక్కొని మెరిసిపోతున్నారక్కడ. అంతా ఒకటే సందడి, కలివిడి హడావుడి. ఆ వేళ నర్సింహులు. వెంకిలకి లగ్గం. మనిషి చీదరించుకొనే కల్మషాలను శుభ్రం చేసేవారు. అన్ని వేళలా రెక్కలు ముక్కలు చేసుకొనేవాళ్లు, దోపిడీకి గురౌతున్నవాళ్లు, అందరికీ చులకనైన వాళ్లు. వాళ్లీ యానాదులు. ఆ పెళ్లి సందడిలో అన్నాలు, కూరలు తయారౌతున్నాయి. పంది మాంసం మసాలా వాసన గుమాయిస్తూంది.

నర్సింహులు పాక ముందు ఓ చిన్న పందిరి. పందిరి మీద కొత్త తాటాకు ధ్వజం. పందిట్లో ఒకటే తప్పెట మోతలు. డోలు తోడు పలుకుతూంది. ఇద్దరు ఆడాళ్లు చిందులు తొక్కుతున్నారు. వెనుక మరో ఇద్దరు పాట అందుకున్నారు. అక్కడున్న ఆడామగవాళ్లకు వంత పాడుతున్నారు. అందరు పెళ్లి సందట్లో ఇలా తన్మయత్వంలో వున్నారు.

ఒక గడ్డపారని ఎండలో నిట్ట నిలువుగా పాతి వుంచారు. అందరి చూపు ఆ గడ్డ పలుగు పనే ఉంది. పలుగు నీడ క్రమక్రమంగా తగ్గిపోతూంది. అందరి మనసులు ఆరాటపడుతున్నాయి. ఆ పలుగుకు నీడ లేకుండా పోయినది. అంటే యానాదుల లెక్కలో పన్నెండైందన్న మాట. అంటే లగ్గం వేళయినట్లు.

"ఓలమ్మీ, ఓరబ్బీ, లెండి, లెండి యాలైపోనాది. నర్సిగాడితో తాళి కట్టించండ్రో!" అంటూ కులం పెద్దలు తొందర చేశారు. తప్పెట్లు, డోలు మోగుతున్నాయి. యానాది లగ్గం వేళకి సరిగ్గా వెంకి మెళ్లో తాళి కట్టాడు. అప్పటి ఆ క్షణం నుండి వెంకి నర్సిగాడి పెళ్లాం ఐపోయింది.

నర్సి, వెంకిల లగ్గం తంతు ముగిసింది. తెచ్చిన కల్లు కుండలన్నీ ఖాళీ అయిపోయాయి. తప్పెట మోతలు తగ్గిపోయాయి. చిందులు తొక్కుతున్న పాదాలు మైకంలో అడుగులేస్తున్నాయి. పాటలు మూగపోయాయి. వంతలు చిన్నగా ఎక్కడి వారక్కడకు వెళ్లిపోయారు. భోజనాలకు పిలుపొచ్చింది. అందరూ పొలోమంటూ బారులు తీరి కూర్చున్నారు. విస్తళ్లలో అన్ని కూరలూ వడ్డించారు. ఐనా కలుపుకోడానికి చేతులు ముందుకు రావటం లేదు వాళ్లకు. అందరి కళ్లూ పంది మాంసం కుండల మీద నిలిచాయి. తునకలు పడ్డాక, వాళ్లందరూ తృప్తిగా తిని లేచారు.

కల్లు మత్తుకు, మాంసపు విందు తోడై మత్తులో జోగుతూ ఎక్కడి వాళ్లక్కడ పడిపోయారు. అడ్డదిడ్డంగా, అస్తవ్యస్తంగా వాళ్ల శరీరాల మీద గుడ్డలతో ఉన్నారక్కడ.

నర్సిగాడి లగ్గం మహా సందడిగా ఘనంగా జరిగిందని అందరూ వాడిని పొగిడారు. పొగడ్తలైతే మిగిలాయి కానీ, నర్సిగాడికి కష్టపడి తాను సంపాదించిన సొమ్మంతా పెళ్లికే ఖర్చయి ఇంక కాళ్లూ, చేతులే మిగిలాయి వాడికి.వెంకిని పెళ్లి చేసుకోవటం నర్సింహులుకి ఒక యజ్ఞం చేసినంత పనయింది. వెంకి కనుముక్కు తీరు చక్కగా ఉంటుంది. ఎర్రని రంగు, కాంతి నిండిన చక్రాల్లాంటి పెద్ద కళ్లు, ఎత్తయినది, మంచి కళగా, ఆకర్షణగా నిజంగా నండూరి వారి ఎంకిలా వుంటుంది.  అందుకే నర్సిగాడు వెంకి ఆకర్షణలో పడి ఎలాగైనా ఆమెనే మనువాడాలని ఆరాటపడ్డాడు. ఆమె తన చిన్ననాటి స్నేహితురాలు. యానాదుల ఇళ్లల్లో పెళ్లి కోసం పెళ్లి కూతురికి 'ఓలి' కట్టాలి. అంటే అమ్మాయిని డబ్బిచ్చి కొనుక్కోవాలి. అమ్మాయి కాస్త అందం, మంచిదనే పేరు గాని వుంటే ఆ 'ఓలి' అమాంతం పెరిగిపోతుంది. వెంకికి చెవులకు దుద్దులు, ఓలి ఇచ్చి మనువాడమన్నారు. ఆ రెంటికీ ఎట్టా లేదన్నా ఓ పదివేలవుతుంది.

నర్సిగాడి అమ్మా, నాన్న, 'మా వల్లకా'దన్నారు. నర్సి తనే సంపాదించి, ఎలాగైనా వెంకిని మనువాడాలనుకొన్నాడు.

వెంకిపై ప్రేమ నర్సింహులు బ్రతుకుని మలుపు తిప్పింది. అల్లరి చిల్లరగా తిరిగే వాడు, వెంకిని కట్టుకొని తనదాన్ని చేసుకోవాలన్న తపనతో కష్టపడి సంపాదించేందుకు పూనుకొన్నాడు. రకరకాల పనులు చేయటం ప్రారంభించాడు. తాగుడు మానేశాడు.

కలుగు తవ్వి ఎలుకలను పట్టే పద్ధతిని వదిలేశాడు. బిసలు పెట్టే

బుట్టలు తయారు చేశాడు. వాటితో ఎలుకలను పట్టడం సులువని గ్రహించి, అలా ఎలుకల్ని ఎక్కువ సంఖ్యలో పడుతూ ఎక్కువ ఆదాయం పొందుతూ, ఇలా బుట్టలతో ఎలుకలు పట్టేవాడుగా ఆ గూడెంలో మొదటివాడయ్యాడు.

యానాదులు మొలకూ, తలకూ ఒకే గుడ్డతో వుంటున్నవాళ్లు, కట్టి ఆయుధంగా కలిగివున్నవాళ్లు. పాతకాలపు ఆచారాలు, అజ్ఞానపు మూఢనమ్మకాలు తప్ప, కాసింత విషయపరిజ్ఞానం లేనివాళ్లు. కలుగులోని ఎలుకను, నీటిలోని చేపను, నింగిలోని పిట్టను పట్టుకొని, కొట్టుకు తినేవాళ్లు. బతుకు భద్రత లేని అమాయకజీవులు.

ఐతే నర్సింహులు లాంటి యువకులు మార్పులకు కారకులౌతున్నారు. కట్టూ, బొట్టూ, తిండితిప్పలు కొద్ది కొద్దిగా మారుతున్నాయి.

"కాలం గడిచింది వేగంగా. వెంకికి తొమ్మిదో నెల వచ్చి నిండుచూలాలైనది. ఒక వెన్నెల రాత్రి వేళ వెంకి నొప్పులతో ఏడుస్తుంటే విన్న నర్సి కంగారు పడి లేచెళ్లి, తల్లిని తెచ్చి భార్య దగ్గర ఉంచి, వూళ్లోకి బయలు దేరాడు. ఊరంతా వెదికాడు. మంత్రసాని దొరకలేదు. చివరకు ఒక ముసలామెని బతిమిలాడి ఇంటికి తీసుకొచ్చాడు."

కష్టపడి కాసులు సంపాదించి దుద్దులు చేయించాడు. వెంకి చెవులకి అవి ఎంతో ప్రేమగా తగిలించి, పెళ్లి చేసుకుని మురిసిపోయాడు. పట్టుపట్టి సాధించాడు. మంచి పనివాడనిపించుకున్నాడు ఆ గూడెంలో. డొంక మీద బారులో మరో కొత్త గుడిసె వెలిసింది. ఆ గుడిసెలో నర్సి, వెంకిల జంట గువ్వల జంటయింది. కూడున్నా, లేకున్నా గుట్టుగా కాపురం చేసుకుంటున్నారు. గుడిసెలో వున్నా, పాకీపనికెళ్లినా, పొలం కెళ్లినా యానాదులు ఆలూమగలు ఇద్దరు ఒకే చోట ఒకరికొకరు తోడుగానే ఉంటారు. ఎటు పోతున్నా, సినిమాకెళ్లినా, సారా అంగడి కెళ్లినా, ఏం చేస్తున్నా ఒకరిని ఒకరు విడిచి వుండరు. కలుగు తవ్వుతున్నా, చేపలను పడుతున్నా వీళ్లిద్దరూ కలిసే చేసేవాళ్లు.

ఒకనాడు మట్టమధ్యాహ్నం నర్సి, వెంకి గుడిసె వదిలి బయట కొచ్చారు. 'గసికి' కర్రకు 'తిర్రి' తగిలించుకున్నారు. సత్తు పళ్లాన్ని 'తిర్రి'లో వేసుకున్నారు. కర్ర భుజాన పెట్టుకొని ముందుకు సాగాడు నర్సింహులు. గుడిసెకు తడిక గొళ్లెం కట్టడం ఆలస్యం అయింది వెంకికి. వెంకి కంగారు పడుతూ పరుగుపెట్టి మొగుణ్ని చేరుకుంది. అమ్మయ్య అనుకొని అడుగులో అడుగు వేసుకుంటూ భర్త వెంట నడిచింది. ఈ సంఘటనలో యానాదుల్లో భార్య, భర్త ఒక్క నిమిషం కూడా ఒకర్ని విడిచి మరొకరు ఉండలేరన్న సత్యం కళ్లకు కట్టినట్లు కనబడుతూంది.మడుగు దగ్గరికి చేరుకున్నారు. లోనికి దిగారు. చేపలు కాళ్లకు తగులుతున్నాయి. అడ్డుకట్ట వేశారు. కట్టకొక చోట గండి పెట్టి, గండిలో 'తిర్రి'ని పెట్టారు. 'తిర్రి'కి దిగువుగా వాళ్లు ఎడంగా నిలబడ్డారు. సత్తుపళ్లెం చేతికి తీసుకున్నాడు. వంగి పళ్లెంతో నీళ్లు చిమ్మటం మొదలెట్టాడు నర్సి.

చేతులు యంత్రాల్లా కదులుతున్నాయి. నీళ్లు పారుతున్నాయి. బయటపడుతున్న చేపలు ఎగిరెగిరి పడుతున్నాయి. కట్టలు తెగకుండా వెంకి కాపాడుతూ, చేపలు నీళ్లల్లోకి పడకుండా చేస్తూంది.

రాత్రి పొద్దు పోయింది. చిమ్మ చిమ్మ నర్సి చేతులు నొప్పులు పెట్టాయి. వంగిన నడుము పైకి లేవనని మొరాయించింది. చెమట ధారలు కట్టి ప్రవహిస్తోంది. ఎగువ నీళ్లన్నీ దిగువకు చేరాయి. బురదలోనే చేపలు తటతట కొట్టుకుంటున్నాయి. చావబోతున్న ఎండు పక్కెలు ఎగిరెగిరి పడుతున్నాయి. వాళ్లిద్దరూ ఎన్నో గంటల పాటు పడిన శ్రమకు ఫలితం దక్కింది.

పట్టిన చేపలతో బుట్ట నిండింది. లోతునీళ్లల్లో బుట్టను జాడించారు. స్నానం చేసి హుషారుగా గుడిసె వైపు నడిచారు.తక్కెడ లేదు. రాళ్లు లేవు. తూకం లేదు. పాతగుడ్డలో చేపల్ని మూటలు కట్టారు. దగ్గర్లో ఉన్న వడ్డీ వ్యాపారి కొండారెడ్డి దగ్గరకు తీసుకెళ్లారు. ఈ గూడెం యానాదులంతా తప్పతాగి, బువ్వకు లేకపోతే కొండారెడ్డి దగ్గరికెళ్తారు. డబ్బు కోసం నిలబడతారు. ఆయనే వడ్డీలు, లెక్కలు, తీసివేతలు వేసి వేలిముద్రలేయించుకొని డబ్బిచ్చి పంపుతాడు. ఎంత వడ్డీ వేస్తున్నాడో ఆ అమాయకులకు తెలియదు. ఇలా చేపలు పట్టిన దాంట్లో చెల్లువేస్తాడు రెడ్డి.

తూకం కూడా ఆయనే వేస్తాడు. రేటూ ఆయనే నిర్ణయిస్తాడు. దొంగ తూకాలతో లెక్కలు తక్కువ చెప్పి తన వడ్డీలకు పోను, పదో, పరకో చేతిలో పెడతాడు. పడిన కష్టానికి ఇదేనా దక్కింది అనుకుంటూ యానాదులు, ఆ డబ్బులతో మళ్లీ తప్పతాగి అప్పులు చేస్తూ, వెట్టిచాకిరి చేస్తూ, దుర్భరమైన జీవనం సాగిస్తున్నారు. నర్సి, వెంకి తెచ్చిన చేపలకు లెక్క కట్టి రెడ్డి డబ్బిచ్చాడు.

డబ్బు చేతిలో పడేసరికి నర్సింహులు మనసు సారా మీద పడింది. వెంకి కోసం మానేసిన కల్లు, సారా, పెళ్లి నాడే కులపెద్దలంతా పట్టుపట్టి త్రాగించారు. "తాగకపోతే ఇది పెళ్లే కాదు. తాగి తీరాలి" అని బలవంత పెట్టి తాగించారు. మళ్లా ఈ రోజు తాగుడు మొదలైంది.కొద్దిగానే తాగుతానని వెంకిని వెంటబెట్టుకెళ్లిన నర్సి, ఉన్న డబ్బు మొత్తానికి తాగాడు. భార్య వద్దని వారించినా ఫుల్‌గా తాగేశాడు. యానాదుల్లో కొందరు ఆడాళ్లు కూడా తాగే అలవాటు ఉంటుంది. కానీ వెంకి చాలా గుణవంతురాలు. కొంచెం దైవభక్తి, తెలివితేటలు కల అమ్మాయి. నర్సికి మాటలు దూసుకొస్తున్నాయి. తూలుతూ, పడుతూ లేస్తూ వెంకిని వాటేసుకుంటూ, ఏడుస్తూ, నవ్వుతూ ఎట్లాగో అర్ధరాత్రికి గుడిశకి చేరారు. ఆ రాత్రంతా తిండితిప్పలు లేకుండా నిద్రబోయారు.

తెల్లగా తెల్లారింది. నీరసంగా లేచారిద్దరూ. ఒళ్లంతా ఒకటే నొప్పులు. మనసంతా వెలితి. కడుపులో ఆకలి దహించి వేస్తూంది ఇద్దరికీ. కొండారెడ్డి గుర్తుకు వచ్చి ఇంటి ముందు నిలబడి సలాం చేసి డబ్బు కావాలని ప్రాథేయపడి నోటుపై వేలి ముద్రలేసి డబ్బు తీసుకెళ్లి, శెట్టి దగ్గర కిరాణా సామాను గుడిశకి తీసుకెళ్లి గుంట పొయ్యి మీద ఎసరు పెట్టి పుల్లాపుడక ఏరి తెచ్చి, ఎగమంట దిగమంట వేశారు. గంజి కాచి తాగారు. తిప్పలన్నీ మరిచిపోయి, నేల మీద పడుకొని నిద్రపోయారు.

000

కాలం గడిచింది వేగంగా. వెంకికి తొమ్మిదో నెల వచ్చి నిండుచూలాలైనది. ఒక వెన్నెల రాత్రి వేళ వెంకి నొప్పులతో ఏడుస్తుంటే విన్న నర్సి కంగారు పడి లేచెళ్లి, తల్లిని తెచ్చి భార్య దగ్గర ఉంచి, వూళ్లోకి బయలు దేరాడు. ఊరంతా వెదికాడు. మంత్రసాని దొరకలేదు. చివరకు ఒక ముసలామెని బతిమిలాడి ఇంటికి తీసుకొచ్చాడు. ప్రసవం సులభంగానే అయ్యింది. కానీ పథ్యమే కష్టంగా ఉన్నది. పాత బియ్యం కాదు గదా, కొత్త నూకలు కూడా ఇంట్లో లేవు. పొలాల మీద హోరు గాలి. మండుటెండలు. ఆ పైన వడగాల్పులు అన్నీ పుట్టిన బిడ్డ పాలిట శాపాలైనాయి. వడగాలికి వడలిపోయిన పసిబిడ్డను చూచి, ఆ తల్లిదండ్రుల మనసు తల్లడిల్లిపోయేది. తల్లి వెంకి ఆకలి జబ్బుకు, బిడ్డ నీరసించి మాగన్నుగా పడివుంటే, ఏదో జబ్బు చేసిందనుకొనేవారు. జబ్బుకు మందుకై పట్నానికెళ్దామంటే డాక్టర్ ఫీజు కట్టడానికి చేతిలో చిల్లిగవ్వ లేదని, బిడ్డను [illegible] కుమిలిపోయి ఏడ్చేవారు. బిడ్డ మీదే పంచప్రాణాలు పెట్టుకొని బ్రతుకు వెళ్లదీస్తున్నారు వాళ్లిద్దరూ.

వేసవి గడిచి వాన కాలం వచ్చింది. మనవడిని ఎత్తుకున్నప్పుడల్లా నాయనమ్మ, "నక్క నోట్లో గెడ్డ కొట్టావు గండరా" అంటూ

గడిచిపోయిన గడ్డు కాలాన్ని జ్ఞాపకం చేసుకొనేది. బిడ్డ పెరుగుతున్నాడు. పనికెళ్లేటప్పుడు నాయనమ్మ దగ్గర వదిలి ఇద్దరూ వెళ్లేవారు. జేజమ్మను ఆటలు పట్టిస్తున్నాడు మనవడు. 'నాను పోతన్న, నాను పోతన్న' అంటూ బుడిబుడి నడకలతో వడివడిగా మనవడు పోతుంటే, వెంట కాపలా ఉండేది. దొరికిన మనవణ్ని పట్టుకొని ముద్దుగా దెబ్బలు కాని దెబ్బలు వేస్తూ మురిసిపోయేది.

ఒక రోజు ఇంటి పక్కన మంచి మట్టమధ్యాహ్నం పూట పూరి గుడిశెకు తాటాకు కప్పుచున్నాడు నర్సి. 'ఒరే నర్సీ, కాసింత చల్లబడి నంక గుడిశ కప్పొట్టయ్యా, కాసింత గంజి తాగెళ్లయ్యా' అంటూ నర్సి అమ్మ మొత్తుకుంటున్నా, 'ఏహె నీ సోదేందే ఎండ లేదు గిండ లేదు' అని విసుక్కున్నాడు. అంతలో నర్సి కొడుకు గుడిశ బయటకొచ్చి ఎండలో కొచ్చాడు. వెంటనే నర్సి వాళ్ల అమ్మను 'ఒసే అమ్మా బుడ్డోణ్ని ఇంట్లోకి తీసుకెళ్లు. ఎండ తగులుతోంది' అంటూ కంగారుగా అరిచాడు. అలా ఓ మూడుసార్లు బిడ్డ బయటకు ఎండలోకి వచ్చాడు. ఇక లాభం లేదనుకొని పిల్లాడ్ని తీసుకెళ్లడం కోసం నర్సి తన ఇంట్లోకెళ్లాడు. వాళ్ల తల్లిని మందలించాడు. అప్పుడు ఆ ముసలామె "ఒరే అయ్యా నీ కన్నకొడుకు కాసేపలా బయటకొచ్చి ఎండలో నిలబడితేనే ప్రేమతో నీ హృదయం ఎలా బాధపడిందో, అలాగే నా తల్లి ప్రేమ నీవలా ఎండలో ఉంటే బాధపడి తల్లడిల్లదా?" అని కంట నీళ్లెట్టుకొని చెప్పింది. వెంకి చూస్తూ పిల్లణ్ని ముద్దాడింది ఆ క్షణాన. ఆకలికి తట్టుకోలేక ఆ పూట ఏదో దుంప తిన్నది వెంకి. కడుపులో నొప్పి మొదలైంది. కళ్లు తిరుగుతున్నాయి. వాంతులు చేసుకుని పడిపోయింది వెంకి. ఏం తోచక పెద్దయ్య దగ్గరకు పరిగెత్తాడు నర్సి. గూడానికి పెద్ద వైద్యుడు తాత లేదా పెద్దయ్య అంటారీయనను. భూతవైద్యమే కాదు రంగం కూడా పెడతాడు. యానాదులందరికీ తాత మీద నమ్మకం. వెంకి చేతులు, నాడి చూశాడు. నాలుగు మాత్రలిచ్చి ఆమె చేత మింగించాడు తాత. ఏదో మంత్రాలు చదివి "ఒరే నర్సీ, ఇదేదో బెట్టగా వుందిరా. రాతిరికి రంగం పెడదాం, అదే తేలిద్ది. నేనున్నాగా భయపడకు" అని చెప్పి గంటలో మాత్ర మింగించమని చెప్పి వెళ్లిపోయాడు. తాతముత్తాతల నాటి నుండి తాత కుటుంబం వైద్యుల కుటుంబమే. అమాయకులను భూతవైద్యాల పేరిట నమ్మించి బాగా ఆస్తులు సంపాదించాడు. తాతనే వైద్యుడు చేతి నిండుగా సంపాదించినా, ఈ మోసాల వైద్యుని వేషం మారేది కాదు. గుబురు మీసాలు, బారు గడ్డం, ముఖాన వెడల్పయిన కుంకుమబొట్టు, మెడలో రుద్రాక్షమాల, చేతిలో వంకీ తిరిగి వున్న లావుపాటి కర్ర.

నర్సి గుడిసె అలికి వుంది. ఇంటి ముందు ఖాళీ స్థలంలో ఈతాకు చాపలు పరిచి వున్నాయి. రాత్రి పదిగంటల వేళ రంగం మొదలైంది. తప్పెట మోగుతూ వుంది. తాత కంఠం కంగున వినిపిస్తోంది. గూడెం యానాదులంతా చాపలపై కూర్చున్నారు.

రంగం అంటే యానాదుల సోది. ఎఱుకల సాని రాగాలు తీసి ఎంతో శ్రావ్యంగా పాడినట్లే, రంగం పెట్టేవాడు కూడా అంత కంటే కమ్మగా పాడుతాడు. తాత గొంతెత్తితే చాలు, యానాదుల్లో పూపొస్తుంది. నాగస్వరానికి పాము పడగలు విప్పి ఆడినట్లు వీళ్లు ఆడతారు. రంగం పెట్టారంటే చాలు, దయ్యమో, దేవరో, లేపోతే వెంకటేశ్వరస్వామో, ఎవరైనా పూనకంలోకి వచ్చినట్లునే. ఆ పూనకం వచ్చినవాళ్లు కడుపు నిండా మెక్కందే వెళ్లరు. దయ్యానికైతే పంది పిల్ల, చాలినంత కల్లు, సారాయి, పసుపు, కుంకుమ, కర్ర చెప్పులు కావాలి. దేవరకైతే మేకపిల్ల, కల్లుకుండ, వేపమండలు, గుగ్గిలం, ధూపం కావాలి. అదే ఏడుకొండలవాడైతే ఏడు టెంకాయలు, ఎత్తెరు పాశము, ఏడు రూపాయల ముడుపు, చాలినంత బియ్యం, సాంబ్రాణి ధూపం కావాల. రంగంలో వెంకిని దయ్యం కొరికి వదిలేసిందని చెప్పాడు భూతవైద్యుడు తాత. దానికి శాంతిగా ఒక నల్ల కోడిపెట్ట, ఓ పంది, రెండు కల్లు కుండలు, వేప మండలు కావాలని సిద్ధం చెయమని చెప్పాడు తాత. గుండె ఆగినంత పనయ్యింది నర్సికి. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినే. ఇప్పుడు ఎలా అనుకొంటూ రేపటి రోజుకు అవన్నీ సిద్ధం చేస్తానని చెప్పి తాతను సాగనంపాడు నర్సి.

నర్సికి వెంటనే తళుక్కుమని ఓ ఆలోచన వచ్చింది. గతంలో పాముల్ని పట్టి దాని గరళాన్ని, తోలు అమ్ముకొని తప్పతాగేవాడు. మంచి ధర పలుకుతుంది కూడా.

వెంటనే పుట్ట దగ్గరకెళ్లాడు. నీరసంగా ఉన్నా, వెంకి భర్త వెంటే వెళ్లింది. గసికి కర్రతో నేర్పుగా, ఓర్పుగా పుట్టను తవ్వుతున్నాడు నర్సి. కనురెప్పలు వాల్చకుండా అదంతా చూస్తోంది వెంకి.

పుట్టలో త్రాచుపాముంది. బారుగా, లావుగా వుంది. దాన్ని చూసిన నర్సి దీన్ని పట్టి చర్మాన్ని జాగ్రత్తగా వలిస్తే చానా డబ్బులొస్తాయి. పెళ్లాం భూతవైద్యానికి ఆ కాసులు అక్కరకొస్తాయని సంతోషించాడు. పాము మంచి వయసులో వుంది. ఏ మాత్రం ఏమరుపాటు వున్నా కాటేస్తుంది. పాము బయటకొచ్చి వెంటబడింది. నర్సి పరుగెత్తుతున్నాడు. పాము తరుముతోంది. నర్సి గిరికీలు కొడుతున్నాడు. వెంటబడుతున్న పామును ఒక్క దెబ్బలో చంపెయగలడు. కానీ పాము మీద దెబ్బ పడిందంటే, పాము తోలు పనికి రాకుండా పోతుందని ఈ తిప్పలు.

నర్సి భార్య వెంకిని, 'ఇంటికెళ్లు నీవు' అని అరిచాడు. కానీ వెంకి 'నీవలా ప్రాణాపాయంలో ఉంటే నేనెళ్లను. చావైనా బ్రతుకైనా కలిసే చద్దాం' అని తెగేసి చెప్పింది వెంకి.నర్సి కర్రను అందుకున్నాడు. భార్యాభర్తలిద్దరి మధ్య తోక పైన లేచి నిలబడి వున్న పాము, మార్చి మార్చి బుసలు కొడుతూ చూస్తోంది. కాటేసేందుకు ఒడుపు చూస్తోంది ఇద్దరి వంకా.

పది గంటలకు మొదలైన పోరాటం పన్నెండయింది. కానీ ముగ్గురూ అలాగే నిలబడి వున్నారు. ఒంటి గంటయింది రాత్రి మూడైంది.

తెల్లారిపోయింది. నర్సి, వెంకి పాము కాటుకు బలై, నోట్లో నురగ కక్కుకుని, ఒకరిపై ఒకరు శవాలై మిగిలారు. నర్సి తల్లి, భూతవైద్యుని గొంతెమ్మ కోర్కెలు వల్లనే కొడుకు కోడలు చనిపోయారని గుండెలదిరేలా విలపించసాగింది. అనాథగా మిగిలాడు పిల్లాడు.

000

ఓ ఇరవై ఏళ్లు గడిచాయి. నర్సి ఉండే గూడానికి కార్లు, జీపులు రయ్‌రయ్‌మంటూ వచ్చాయి. యానాదుల్లో ఇప్పటికీ, అప్పటికీ తేడా ఒకటే చిన్న టి.వీ.లు. రేకుల పెద్దుగా మార్పు లేదు. అదే అజ్ఞానం. అదే సారాయికి బానిసలుగా మారి జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. "ఒరే సర్కారోళ్లు వచ్చార్రో, బియ్యం ఇస్తున్రేమో రాండి" అని అందరు యానాదులు మూగారు. అంతలో కారు లోంచి ఓ 30 ఏళ్ల యువకుడు టక్ చేసుకొని, టై కట్టుకొని ఫైల్స్‌తో కారు దిగాడు. సెక్రటరీ జాయింట్ కలెక్టర్ గారని వారందరికీ చెప్పాడు. "నా పేరు వెంకట్. మీ నర్సింహులు, వెంకి కొడుకుని. నేను అనాథగా మారింది మీలో కొందరికి తెలుసు. అప్పుడు మన వూరు మాస్టారు నన్ను పెంచి ఇంత పెద్ద చేశాడు. మన యానాదుల్లో ఇంకా అజ్ఞానం, నిరక్షరాస్యత మూలంగా దగా పడుతూ, సారా మత్తులో జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. మన కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుంది. మనలో చదువు లేక ఆ ఫలాలు అందట్లేదు. అందుకే మీ అందరిలో మార్పు తేవడానికే వచ్చాను. అందరికీ చదువు చెప్పించే ఏర్పాటు చేస్తాను. యువకులకు చదువు ప్రభుత్వం చేత చెప్పించి ఉద్యోగ ఉపాధిని కల్పిస్తాను. మా అమ్మా నాన్నల్లా మీరు బలి కావటం చూడలేను" అంటూ వారందరినీ, పేరుపేరున సమస్యలడిగి తెలుసుకొన్నాడు. అమ్మ గుర్తుగా, అతనికి వెంకట్ అనే పేరు పెట్టాడు మాస్టారు. అమ్మలాగే ఆప్యాయత చూపాడు.

రోజులు, సంవత్సరాలు గడిచాయి. జాయింట్ కలెక్టర్ వెంకట్, తన సాటి యానాదుల్లో చైతన్యం తెచ్చి, వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపాడు! ●